'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# బీఆర్ఎస్.. తెలంగాణ రక్షణ పార్టీ

బిడ్డకు తండ్రిని మించిన సంరక్షకుడు లేనట్టే, తెలంగాణ పిత కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్‌కు మించిన సంరక్షక పార్టీ లేదన్న చర్చలు మొలకెత్తినయి తెలంగాణలో. గత తొమ్మిదిన్నరేండ్లలో కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ సాధించిన అపూర్వ ప్రగతిని ప్రజలు నెమరు వేసుకోవటమే అందుకు కారణం. తెలంగాణను ఇచ్చింది తామే అంటున్నది కాంగ్రెస్. కానీ, చావు అంచులదాకా వెళ్లి తెలంగాణ అనే శిశువును కన్నది కేసీఆర్. భారత పిత గాంధీ, ఆంధ్రప్రదేశ్ పిత పొట్టి శ్రీరాములు. తెలంగాణ పిత కేసీఆర్. అన్నది చారిత్రక సత్యం.

స్వతంత్ర భారతాభివృద్ధిని చూడకుండానే గాంధీని పొట్టన బెట్టుకున్నాడు మతోన్మాద గాడ్సే. ఆంధ్రప్రదేశ్ శిశువును చూసుకోకుండానే అమరులయ్యారు పొట్టి శ్రీరాములు. అయితే, తెలంగాణ ప్రజల అదృష్టవశాత్తూ తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి పరిశ్రమించే సదవకాశం కూడా తెలంగాణ పితకే లభించింది. నాడు విద్యుత్, వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభాలతో తల్లడిల్లుతున్న తెలంగాణ నుంచి, పొట్టచేత బట్టుకొని వలసలెత్తారు ప్రజలు. ఆ ఆకలి తెలంగాణను అన్నపూర్ణగా రూపొందించేందుకు తనకంటూ ఒక ప్రణాళికను రూపొందించుకున్నారు కేసీఆర్. తొమ్మిదిన్నరేండ్లలోనే దశాబ్దాలుగా ఎదిగిన భారతాగ్ర రాష్ట్రాల సరసన తెలంగాణను నిలిపారు. దటీజ్ కేసీఆర్.



పాతూరి వేంకటేశ్వరరావు



పంజాబ్, హర్యానాలకు దీటైన ధాన్యాగారంగా తెలంగాణను మార్చారు కేసీఆర్. వరి ఉత్పత్తి, అటవీ పునరుద్ధరణ, విద్యుత్ వినియోగం, స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయాలలో భారతాగ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దారు. అత్యధిక గురుకులాలు, వైద్య కళాశాలలు, పాలనా భవనాలను నిర్మించారు. అత్యధిక జాతీయ అవార్డుల సాధనలో రాష్ట్రాన్ని ముందువరుసలో నిలిపారు. అద్భుత, ఆధ్యాత్మిక శిల్పకళా క్షేత్ర నిర్మాణంలోనూ దేశంలోనే ప్రథమ రాష్ట్రంగా తెలంగాణ పేరొందింది. ఫ్లోరైడ్ రహిత రాష్ట్రంగా, నూరు శాతం సాగునీటి వనరులను పెంపొందించుకున్న ఏకైక రాష్ట్రంగా నీతి ఆయోగ్ నుంచి ప్రశంసలందుకున్నది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవటంలో, ఉగ్రవాద నిర్మూలన విధానాల్లో తెలంగాణ ఇంటెలిజెన్స్, పోలీసు వ్యవస్థలను ఆదర్శంగా తీసుకోవాలని ప్రధాని మోదీ కూడా ప్రశంసించారు. దశాబ్ద కాలంలో ఒక్క మతకల్లోలం గానీ, ఉగ్రవాదుల విధ్వంసం గానీ తలెత్తని ప్రశాంత తెలంగాణను రూపుదిద్దారు. వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్తునిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. హైదరాబాద్‌కు క్లీన్ అండ్ గ్రీన్ సిటీ అవార్డు, 1.65 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన, సాగు, తాగునీరు అందించడం, ఎడ్యుకేషన్, ఐటీ హబ్‌ల నిర్మాణాలు.. ఇలా ఒక్కటేమిటి అనేక అంశాల్లో దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దారు. వ్యవసాయాభివృద్ధికి సమాంతరంగా పారిశ్రామికాభివృద్ధిని సాధించిన సవ్యసాచి. దటీజ్ తెలంగాణ పిత కేసీఆర్. అందుకే ఆయన కోసం నేడు భరతమాత ఎదురుచూస్తున్నది.

'ముఖ్యమంత్రి పదవి కోసమే రాష్ట్రాన్ని కేసీఆర్ విభజించారు' అని ప్రత్యర్థులు విమర్శించారు. కాదు గాక కాదు. పాలనా సౌలభ్యం, ప్రగతి సాధనలకు చిన్న రాష్ట్రాలే శ్రేయస్కరమన్న అంబేద్కర్ సూచనను ఆచరించారు కేసీఆర్. తెలంగాణ రాష్ట్రాన్ని చిన్న జోన్‌లు, చిన్న జిల్లాలుగా విభజించి, జిల్లాకో పాలనా భవనం, వైద్య కళాశాల వంటి ఎన్నో మౌలిక సదుపాయాలను కల్పించటమే అందుకు నిదర్శనం.

'మన పూర్వీకులు, మహనీయుల కృషిని స్మరించటం, వారిని సత్కరించటమంటే మన ప్రగతికి బాటలు నిర్మించుకోవటమే' అన్నారు ప్లేటో. తెలంగాణలో సాగునీటి చెరువులను నిర్మించింది మన పూర్వీకులైన కాకతీయులు. ఆకాశం నుంచి గంగమ్మను భూమ్మీదికి రప్పించిన మహనీయుడు భగీరథుడు. అందుకే సాగునీటి పథకానికి 'మిషన్ కాకతీయ'గా, ఇంటింటికీ తాగునీటి పథకానికీ 'మిషన్ భగీరథ'గా నామకరణం చేసి వాళ్లను సన్మానించారు కేసీఆర్. వారి కృషిని ఆదర్శంగా స్వీకరించారు. అలాగే రాజ్యాంగానుగుణంగా పాలన సాగించేందుకు వీలుగా అద్భుతమైన సచివాలయాన్ని నిర్మించారు. దాని ఎదుటే సుందరవనంలో మన రాజ్యాంగ కర్త అంబేద్కర్ విగ్రహాన్ని స్థాపించి ఆయన పట్ల కృతజ్ఞతను చాటుకున్నారు.

అటువంటి తెలంగాణ పిత కేసీఆర్‌ను.. తెలంగాణ సాగు, తాగునీటి కోసం నిర్విరామంగా పరిశ్రమించిన హరీశ్‌రావును, పట్టణ, ఐటీ రంగాల అభివృద్ధికి అపూర్వంగా పరిశ్రమించిన కేటీఆర్‌లను ముఖ్యమంత్రి దారుణమైన భాషలో విమర్శించటం శోచనీయం. పాలనను మరింతగా ప్రజలకు చేరువ చేసి, తెలంగాణ ప్రగతి కోసం అనన్య సామాన్యంగా పరిశ్రమిస్తున్న కేసీఆర్‌ను ప్రజలు దూరం చేసుకోవటం దురదృష్టకరమంటున్నారు సామాజిక శ్రేయోభిలాషులు.

ఇక రాజకీయ విశ్లేషకులు చెప్తున్న కారణాలు ఇలా ఉన్నాయి. కేసీఆర్ సర్కార్ చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరనే ధీమాతోనే ప్రజలకు వాటిని పదేపదే వివరించే కార్యక్రమాన్ని ఎన్నికలొచ్చే దాకా నిర్లక్ష్యం చేశారు బీఆర్ఎస్ నేతలు. కానీ, 'నిన్న ఉదయం మీరేం తిన్నారు' అని అడిగితే గుర్తు తెచ్చుకునేందుకు ఆలోచిస్తారు ఎవరైనా. అది మానవ నైజం. ఎంతటి ప్రోగ్రెసివ్ పార్టీ అయినా, ఈ లాజిక్కును విస్మరించకూడదంటున్నారు విశ్లేషకులు. ఎస్సీ, బీసీ, మైనారిటీల రంగాలకు చెందిన నేతలను అంశాల వారీగా అవగాహన కల్పించి, వాళ్లతోనే విమర్శలకు చెక్ పెట్టవచ్చని అంటున్నారు విశ్లేషకులు. ప్రభుత్వంతో పాటు సమాంతరంగా పార్టీ క్యాడర్‌ను ఎడ్యుకేట్ చేసుకుంటూ బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలలా ప్రభావితం చేయగల క్యాడర్‌ను రూపొందించుకోవాలి. తద్వారా బీఆర్ఎస్‌ను మరింతగా బలోపేతం చేసుకోవచ్చు.

కేసీఆర్ దీక్షాదక్షతలను మహాభారతంలోని మందపాలుడనే పక్షి మహర్షితో పోలుస్తున్నారు. ఆ మహర్షి భార్యాబిడ్డలతో ఖాండవ వనంలోని మహా వృక్షం మీద నివసిస్తుంటాడు. జ్ఞానార్థియై నిరంతరం సంచరిస్తూ ఉంటాడాయన. బిడ్డల్ని కాపాడుకుంటూ అక్కడే ఉంటుంది అతని భార్య. ఒక రోజు అగ్నిదేవుడు ఖాండవ వనాన్ని దహిస్తుంటాడు. ఎగసిపడుతున్న మంటల్ని చూసి 'అయ్యో ఈయన ఇంటిపట్టున ఉండడు. రెక్కలు రాని ఈ బిడ్డల్ని నేనెలా కాపాడుకోగలను దేవుడా' అని ఆమె దుఃఖిస్తుంటుంది. ఎక్కడున్నా తన దివ్యదృష్టి ద్వారా భార్యాబిడ్డల యోగక్షేమాలను గ్రహిస్తుంటాడు మందపాలుడు. ఆ ప్రమాదాన్ని గ్రహించి తన భార్యబిడ్డల్ని కాపాడాలని తనున్నచోటు నుంచే అగ్నిదేవుని ప్రార్థించారు. వాళ్లు నివసించే వృక్షానికి అల్లంత దూరం నుంచే తన దిశను మార్చుకున్నాడు అగ్నిదేవుడు. హమ్మయ్య అదృష్టవశాత్తూ బతికామనుకుంటుంది ఆయన భార్య. కానీ, తన భర్త తపోశక్తే తమను కాపాడిందన్న వాస్తవం ఆమెకు తెలియదు.

నిన్న, నేడు, రేపు.. తెలంగాణ వాణిని పార్లమెంట్‌లో ప్రతిధ్వనింపజేయగలిగిన పార్టీ బీఆర్ఎస్.. బీఆర్ఎస్.. బీఆర్ఎస్సే. ఎందుకంటే, తెలంగాణను కన్న తల్లి బీఆర్ఎస్. కాంగ్రెస్, బీజేపీలు సవతి తల్లులు. 'తన సొంత బిడ్డల యోగక్షేమాలు, ఎదుగుదలకు మాత్రమే సవతి తల్లి అంకితమవుతుంది' అని దశాబ్దాల కాంగ్రెస్ పాలన, నవ వసంతాల బీఆర్ఎస్ పాలన నిరూపించాలని అన్నారొక పురోహితుడు. కాబట్టి తెలంగాణ ప్రజలు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, ప్రజా కవులు, గాయకులు, కళాకారులు.. కదం తొక్కుతూ, పదం పాడుతూ, పరిశ్రమిస్తూ, పరాక్రమిస్తూ రానున్న పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌ను పున్నమి చంద్రునిలా భాసింపజేయాలి.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)



నేడు చెన్నబోయిన కమలమ్మ వర్ధంతి

ఓ మనిషి శరీరంలో నీరెంత ఉంటుందంటే ఏ డాక్టరైనా చెపుతాడు. కానీ ఓ మహిళ కంట్లో కన్నీరెంతంటే జవాబు మాత్రం ఏ వైద్యుడూ చెప్పలేడు. కన్నబిడ్డను చేజేతులా దూరం చేసుకున్న మహిళ మాత్రమే చెప్పగలదు. ఆరు నెలల బిడ్డను పట్టుకొని ఎవరు తీసుకుంటారా అని అడవిలో రెండు కిలోమీటర్లు వెదుకులాడి చివరకు కనపడిన కోయ దంపతులకు ఆ బిడ్డను అప్పగించిన తల్లి ఆవేదన, ఆక్రోశం, బాధ వర్ణనాతీతం. అమ్మపాలకు ఏడ్చే ఆ బిడ్డ ఏడుపు కంటే బిగ్గరగా ఏడుస్తూ వెనుదిరిగిన తల్లి చెన్నబోయిన కమలమ్మ.

## త్యాగానికి ప్రతీక కమలమ్మ

నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం, తన కన్నబిడ్డ ఈ రెండింటిలో దేన్ని వదులుకోవాలో తేల్చుకోవాల్సి వస్తే.. అదీ మహిళకు అటువంటి పరిస్థితి ఎదురైతే ఎటువంటి నిర్ణయం తీసుకుంటుంది? సాధారణ మహిళల సంగతేమో కానీ, చెన్నబోయిన కమలమ్మ మాత్రం అమాయక ప్రజల కోసం తన కన్నబిడ్డనే వదులుకోవాలని నిర్ణయించుకున్నారు. నిజాంల అణచివేత పాలనకు, నిర్దాక్షిణ్యమైన రజాకార్లు, భూస్వాముల సైన్యానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు కమలమ్మ.

ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నైనాల గ్రామంలో 1901లో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో రంగారావు, రంగమ్మ దంపతులకు జన్మించారు కమలమ్మ. 15 ఏండ్ల వయసులోనే తెలంగాణ విమోచన పోరాటంలో భాగంగా రజాకార్లతో పోరాడేందుకు సాయుధ పోరాటంలో పాల్గొన్నారామె. తన భర్త చెన్నబోయిన ముకుందం అలియాస్ అప్పన్నతో కలిసి పోరాటంలో చేరడానికి ముందే పెద్ద కుమారుడిని వారి అత్తమామల వద్ద విడిచిపెట్టారు. అజ్ఞాతంలో ఉండగా పుట్టిన మరో కుమారుడిని విడిచిపెట్టాలని, లేదంటే పోరాటం నుంచి తొలగిపొమ్మని ఆ దంపతులకు దళం కమాండర్ ఎం.ఓంకార్ చెప్పారు. చంటి పిల్లవానితో ఉండటం వల్ల శత్రువులకు దొరికిపోయే ప్రమాదం ఉందని ఆయన భావించారు. రక్త సంబంధం కన్నా, వర్గ సంబంధమే విలువైనదిగా భావించి దంపతులిద్దరూ ప్రజారక్షణ, సాయుధ దళాల ప్రాణాలే ముఖ్యమంటూ పసికందును అడవిలో ఒక గుర్తు తెలియని కోయ జాతి కుటుంబానికి దానం చేశారు.

సాయుధ పోరాటంలో పాల్గొంటూనే నర్సుగా, సాంస్కృతిక బృందంలో సభ్యురాలిగా, దళంలో సాయుధ పోరాట యోధురాలిగా కమలమ్మ సేవలందించారు. ఆమె తన పాటలు, ధైర్యసాహసాలతో వందలాది మంది సాయుధ పోరాట యోధులకు, సామాన్య ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారు. ఆనాటి అజ్ఞాత కవి తిరునగరి రామాంజనేయులు రచించిన 'సై.. సై.. గోపాలరెడ్డి.. నీవు నిలిచావూ ప్రాణాలొడ్డి' పాట తన కంచు కంఠంతో పాడి దేశవ్యాప్తంగా పీడిత ప్రజల గుండెల్లో మార్మోగించారు. వృద్ధాప్యంలో కూడా నిజాం నిరంకుశత్వంపై అనేక పాటలు ఆలపించారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన తర్వాత కమ్యూనిస్టు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. సీపీఐ మహిళా సమాఖ్య కార్యదర్శిగా కూడా కమలమ్మ సుదీర్ఘకాలం పనిచేశారు.

8, 9వ తరగతుల సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకాల్లో హైదరాబాద్ విముక్తి కోసం ఆమె చేసిన పోరాటానికి సంబంధించిన పాఠ్యాంశాన్ని తెలంగాణ ప్రభుత్వం పొందుపరిచింది. 2008లో ఆమె పేరును నోబెల్ శాంతి బహుమతికి నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ ప్రతిపాదించింది. కానీ సకాలంలో ప్రతిపాదనలు పంపకపోవడంతో ఆ ప్రతిపాదన నిలిచిపోయింది. అణగారిన ప్రజల స్వేచ్ఛకు ఆమె చేసిన కృషికి గుర్తింపుగా 2016లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ విశిష్ట మహిళా పురస్కారంతో తెలంగాణ ప్రభుత్వం సత్కరించింది. 2018 మార్చి 11న కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో ఆమె మరణించారు.



సాయి లోహిత పులపా



# అవినీతి నిర్మూలన ఓ బూటకం

2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అవినీతి వ్యతిరేక ఎజెండా సహాయపడింది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రజలు ఆశగా ఎదురుచూశారు. స్విస్ బ్యాంకుల్లో మూలుగుతున్న అవినీతి మూటలను తెచ్చి తమకు పంపిణీ చేస్తారని భావించారు. కానీ వారి ఆశలు అడియాసలే అయ్యాయి.



స్వామి ఆర్వీవీయస్

ఇటీవలి వారాల్లో అవినీతి మళ్లీ వెలుగులోకి వచ్చింది. ఒకటి కంటే ఎక్కువ విధాలుగా, అవినీతి ఆరోపణలు బిలియన్లను దాటిన 2012-14 దశను గుర్తు చేస్తుంది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ కరప్షన్ పర్సెప్షన్ ఇండెక్స్ (సీపీఐ) 2023 నివేదికలో భారత్ భారీగా పతనమైంది. 180 దేశాలున్న ఈ జాబితాలో 2022లో 85వ స్థానంలో ఉన్న భారత్.. 2023 నాటికి 93వ స్థానానికి పడిపోయింది. మొత్తం స్కోరు 100 స్కేలుపై 40 నుంచి 39కి పడిపోయింది. భారత్‌ను ఆసియా-పసిఫిక్‌లో అత్యంత అవినీతి దేశంగా ఆ నివేదిక పేర్కొంది.

అవినీతి అనేది ప్రజల దైనందిన జీవితంలో ఒక వాస్తవం. ఉన్నత పదవుల్లో ఉన్నవారు చట్టానికి అతీతులని, అవినీతికి వ్యతిరేకంగా ప్రస్తుతం ఉన్న చట్టాలను వారు పట్టించుకోరన్నది వాస్తవం. ఎక్కువగా మధ్యతరగతి, కింది స్థాయి అధికారులే పట్టుబడతారు, అదీ కొన్ని సందర్భాల్లో మాత్రమే. పట్టుబడిన తర్వాత మళ్లీ అవినీతి మార్గాలను ఉపయోగించి చాలా మంది తప్పించుకుంటారు. అజ్ఞాత దాతల నుంచి పెద్దమొత్తంలో డబ్బును రాజకీయ పార్టీలు సేకరించి ఎన్నికల్లో గెలిచేందుకు ఉపయోగించడంతో ఎన్నికలు అవినీతికి ఆలవాలంగా మారాయి. ఎన్నికల్లో గెలిచిన తర్వాత మళ్లీ అవినీతి మార్గాల ద్వారా డబ్బును సంపాదిస్తారు. ఇతర ప్రభుత్వాలను విచ్ఛిన్నం చేసి తమ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తారు. ఆ డబ్బు అంతా అవినీతి వ్యవస్థలోకి వెళ్తుంది. ప్రతిపక్షంలో ఉన్నవారిపైన, తమను విమర్శించేవారిపైన సెలెక్టివ్‌గా అవినీతి వ్యతిరేక చర్యలు తీసుకుంటున్నారు పాలకులు. తమవారి, తమతో చేతులు కలిపినవారి అవినీతి పాలకులకు కనపడదు. అవినీతి నిరోధక చర్యలకు విశ్వసనీయత లేకపోవడంతో ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోతున్నాయి.

న్యాయ వ్యవస్థలు బలహీనపడటం వల్ల ప్రభుత్వ అధికారుల్లో జవాబుదారీతనం తగ్గిపోయిందని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ పేర్కొంది. న్యాయాన్ని నిరంకుశ, అప్రజాస్వామిక నాయకులు నిర్వీర్యం చేస్తున్నారని, లంచగొండితనం, అధికార దుర్వినియోగం అన్ని విభాగాల్లోనూ ఉందని వివరించింది. ఇది ప్రాథమిక హక్కులకు ముప్పుగా పరిణమించింది. పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రజల అణచివేత, పత్రికా స్వేచ్ఛ, ఇతర స్వేచ్ఛలపై జరుగుతున్న దాడులు బలహీనపరుస్తున్నాయి. అవినీతికి ఉత్తమ విరుగుడు పారదర్శకత, అది రాజకీయ పార్టీలతో సహా ప్రభుత్వం, పరిపాలన, సంస్థలలో ఎక్కడా కనిపించడం లేదు.

ప్రజలకు వారి హక్కుగా అందాల్సిన ప్రాథమిక సేవలను పొందడానికి కూడా డబ్బు చెల్లిస్తారనే విషయం అందరికీ తెలిసిందే. ప్రభుత్వ సేవలను పొందడానికి ప్రతి 10 మందిలో ఏడుగురు లంచాలు ఇస్తున్నారని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ తెలిపింది. దేశంలో చెల్లిస్తున్న లంచాల్లో 73 శాతం తక్కువ ఆర్థిక వర్గాల నుంచేనని నివేదిక పేర్కొంది. కానీ, పెద్దపెద్ద మోసాల కేసులు వెలుగులోకి వచ్చినప్పుడు మాత్రమే అవినీతిపై దృష్టి సారిస్తారు. పేదలను ఎక్కువగా ప్రభావితం చేసే రోజువారీ అవినీతిపై పెద్దగా చర్చ జరగదు. రాజకీయ నాయకులు తెలివిగా ధనిక-పేద అంతరాలను చూపి ఓటర్లను పోలరైజ్ చేస్తారు.

పెద్దనోట్ల రద్దును అవినీతి నిర్మూలనకు అతిపెద్ద అడుగుగా ఎన్డీయే ప్రభుత్వం చెప్పుకున్నప్పటికీ అది పెద్దగా ప్రభావం చూపలేదు. కానీ, సంపన్నులపై ఎక్కువగా ప్రభావం చూపిందనే భావనను సృష్టించింది. ధనవంతులపై ప్రతీకారం తీర్చుకోవాలనే తపనతో పేదలు మొదట్లో దాన్ని భరించారు. ఇది రాజకీయ నాయకుల ఉద్దేశానికి బాగా ఉపయోగపడింది. మళ్లీ ఎన్నికలు వస్తున్నాయంటే ఎప్పటిలాగే అవినీతి వ్యతిరేక ఎజెండాతో ప్రజల ముందుకు రాజకీయ పార్టీలు వస్తాయి.

# పాలమూరు గొంతెండుతున్నది

ఉమ్మడి ఏపీలో నాలుగు దశాబ్దాలకు పైగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణను దగా చేసింది. అందులోనూ పాలమూరును కరవుసీమగా మార్చిన ఘనత ఆ పార్టీదే. 2004 నుంచి 2014 వరకు వరుసగా పదేండ్లపాటు అధికారంలో ఉన్న హస్తం పార్టీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును గాలికొదిలేసి పాలమూరు రైతుల నోట్లో మట్టి కొట్టింది. స్వరాష్ట్రం సిద్ధించాక బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పూర్తి చేసి కల్వకుర్తికి నీరు ఇచ్చి పాలమూరును రతనాల సీమగా మార్చింది.





మేడిపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి

వెనుకబడిన ఉమ్మడి పాలమూరు జిల్లాను నిండా ముంచింది కాంగ్రెస్ పార్టీయే. పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ నీళ్లు తీసుకుపోతున్నా పదవుల కోసం పాకులాడారే తప్ప కనీసం ప్రతిఘటించలేదు నాటి కాంగ్రెస్ నేతలు, మంత్రులు. ఒక్క కల్వకుర్తి అనే కాదు, ఉమ్మడి పాలనలో తలపెట్టిన ఏ ఒక్క ప్రాజెక్టు కూడా కాంగ్రెస్ సకాలంలో పూర్తి చేయలేదు. అసంపూర్తిగా వదిలేసింది. వాటిని పూర్తి చేసి బీఆర్ఎస్ సర్కార్ రైతులకు నీళ్లు ఇచ్చిందే తప్ప ఏనాడూ ప్రాజెక్టుల పేర్లు మార్చే ప్రయత్నం చేయలేదు.

ఉమ్మడి ఏపీలో దగా చేసింది సరిపోదన్నట్టు.. రాష్ట్ర విభజన సమయంలోనూ తెలంగాణకు కాంగ్రెస్ అన్యాయం చేసింది. రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపకాలు చేపట్టకుండానే రాష్ట్రాన్ని విభజించి నీటి పంచాయితీ పెట్టిందే కాంగ్రెస్. ఆనాడు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ తెలంగాణకు రావాల్సిన న్యాయమైన నీటి వాటాలను తేల్చకపోవడంతోనే నేటికీ ఆ పంచాయితీ తెగడం లేదు. మరి ఈ పాపమెవరిది?

'రాష్ట్రం మేమే ఇచ్చాం' అని గప్పాలు కొట్టే కాంగ్రెస్.. ఎన్నడూ విభజన హామీల కోసం పోరాడలేదు. ఆనాడు చేసిన మోసం చాలదన్నట్టు.. కేంద్ర ప్రభుత్వం గత పదేండ్లుగా కృష్ణా జలాల వాటా తేల్చకుండా కాలయాపన చేస్తున్నా కాంగ్రెస్ ఎంపీలు ఏనాడూ నోరు మెదపలేదు. నాడు ఎంపీలుగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ, ఏఐసీసీ నాయకులు గానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్కసారి కూడా పార్లమెంట్‌లో కేంద్రాన్ని ప్రశ్నించలేదు. ఇది మీ చేతగానితనానికి నిదర్శనం కాదా? పాలమూరుపై వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తున్న కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం పోరాడకుండా ఎందుకు చేతులెత్తేశారు? 2004లో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉండి కూడా జాతీయ హోదా ఎందుకు తీసుకురాలేదు? అది కాంగ్రెస్ నేతల చేతగానితనం కాదా? ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రతిపాదించి పదేండ్లలో తట్టెడు మన్ను కూడా తీయకుండా కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చింది కాంగ్రెస్ కాదా?

హస్తం పార్టీ అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేసి, ఆయకట్టును స్థిరీకరించిన ఘనత కేసీఆర్ సర్కారుది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పనులు పూర్తి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. మిగిలిన ఆ 10 శాతం పనులు పూర్తి చేస్తే గతంలో చేసిన పాపాలకు కొంతైనా ప్రాయశ్చిత్తం కలుగుతుంది. రేవంత్ సర్కార్ చేసిన అతిపెద్ద మోసపూరిత చర్య కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడం. వారు చేసిన తప్పులను ప్రజల ముందుంచి.. 'ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించబోం' అని వారితోనే అసెంబ్లీలో తీర్మానం చేయించిన ఘనత బీఆర్ఎస్ పార్టీది. ప్రాజెక్టులను అప్పగించలేదని బుకాయిస్తూనే.. తాగునీరు కోసం లేఖ రాసింది నిజం కాదా? కృష్ణా నీళ్లు ఎవరి ఆధీనంలో ఉన్నట్టు?

పల్లెపల్లెనా పల్లేర్లు మొలిచే నా పాలమూరులోన కాడి నుంచి మిషన్‌కాకతీయతో చెరువుల్లో పూడిక తీసి, పాడుబడ్డ చెరువులను పునరుద్ధరించి, ప్రాజెక్టులను పూర్తి చేసి, వందల సంఖ్యలో చెక్‌డ్యాంలు నిర్మించి, కొత్త ఆయకట్టును సాగులోకి తెచ్చి, పడావుపడ్డ భూములను బంగారు తునకలుగా మార్చి, రైతన్నలు బంగారం పండించే దాకా తెచ్చింది ఎవరు? బీఆర్ఎస్ కాదా? కేసీఆర్ పాలనలో పాలమూరు ఆకుపచ్చ పైట కప్పుకొన్నదని గర్వంగా చెప్పుకొన్నం. సంతోషపడ్డం. ఉమ్మడి ఏపీలో బోరు, బాయి నీళ్లే మా పాలమూరుకు తాగునీరు. మిషన్ భగీరథతో పాలమూరు దూప తీర్చి, మంచి నీరు రుచి చూపిందే కేసీఆర్. ఈ తంతులో నీళ్ల నిరంజనుడిగా పేరొందిన సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కృషి వెలకట్టలేనిది.

అంతటి పునర్నిర్మాణాన్ని మార్పు పేరుతో ధ్వంసం చేస్తున్నది కాంగ్రెస్ సర్కారు. ఉమ్మడి పాలనలో దర్శనమిచ్చిన నెర్రెలు బారిన భూములు, ఎండిన చెరువులు, మత్తళ్లు లేని చెక్‌డ్యాంలు, తాగునీటి కటకటలు చూస్తుంటే మళ్లా పాత రోజులు వచ్చినట్టే అనిపిస్తున్నది. గొంతు తడారుతున్నది. భవిష్యత్తును తల్చుకుంటేనే భయమేస్తున్నది.



## మిగతా వాళ్లు ప్రజలు కాదా?

బెంగళూరులో తాగడానికి నీళ్లు కూడా దొరకడం లేదు. నగర ప్రజలంతా నీళ్లు లేక అల్లాడుతుంటే ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు సురేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక్క నియోజకవర్గానికే నోడల్ అధికారిని నియమించడమేంటి? మిగతా వాళ్లు ప్రజలు కాదా?

\- మాళవిక అవినాశ్, కర్ణాటక బీజేపీ ఉపాధ్యక్షురాలు